## 163. స్వర్గంలో కాకి

గణేష్‌పురిలోని సద్గురు నిత్యానంద బాబా దగ్గరకి కొందరు ప్రజలు ఆయన దర్శనార్థం ఓ శివరాత్రికి వచ్చారు.

వారిలోని ఒకతను బాబాతో రహస్యంగా చెప్పాడు.

"బాబా. ఇక్కడికి మమ్మల్నందరినీ తీసుకువచ్చినతను తాగుతాడు. చేపలు తింటాడు."

"అయితే ఏమిటి? మర్నాటి కల్లా అతను మల మూత్రాల ద్వారా వాటన్నిటినీ బయటకి పంపించేస్తూంటాడు. ఇక తర్వాత అవి అతని దగ్గర వుండవు. నువ్వు మాత్రం ఎందుకు వాటిని అంటిపెట్టుకుని వుంటావు?"ప్రశ్నించారు బాబా.

స్వర్గానికి వెళ్ళినా కాకి మలాన్ని తినడానికే ఎలా ప్రయత్నిస్తుందో అలా కొందరు ఎంతో మంచివాళ్ళ గురించి కూడా చెడు మాటలు చెప్పి సంతోషిస్తూంటారు. వారు స్వయంకృషితోనే అందులోంచి బయటపడాల్సిన అవసరం వుంది.

## 164. అయిందా? లేదా?

ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారిలో చాలామందిలో కలిగే నమ్మకం, తమకి ఆత్మ సాక్షాత్కారం కలగడం జరిగిపోయిందన్నది. ఆశాపూరితమైన ఆలోచనల వల్ల కొందరు ఇలాంటి భ్రాంతికి లోనవుతూంటారు. అలాంటివారిలో ఒకరు తన గురువు దగ్గర దీక్ష తీసుకున్నాక కొంత కాలం ఒంటరిగా ధ్యానం చేసాడు. తర్వాత వెళ్ళి తన గురువుని కలుసుకుని చెప్పాడు.

"స్వామీ! నాకు ఆత్మ సాక్షాత్కారం అయింది."

అతన్ని తేరిపార చూసి చెప్పాడు గురువు.

"ఇంకా అవలేదు."